చుక్కల మందుకు చక్కని స్పందన

- 97.3 శాతం పూర్తి
- నేడు, రేపు ఇంటింటికీ పల్స్ పోలియో

జగిత్యాల/జగిత్యాల అర్బన్, మార్చి 3: జగిత్యాల జిల్లాలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. 93,836 మంది లక్ష్యానికి గానూ 91,302 మంది చిన్నారులకు చుక్కలు వేయగా, 97.3 శాతం పూర్తి అయ్యింది. కేంద్రప్రభుత్వం ద్వారా ప్రతి ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఐదేండ్లలోపు పిల్లలకు వైద్యసిబ్బంది పోలియో చుక్కల మందు వేశారు. నెల రోజులుగా కలెక్టర్ అధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీలు సేవలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ముఖ్య కూడళ్లు, బస్టాండ్, స్కూళ్లకు స్వచ్ఛందంగా పిల్లలు తరలి వచ్చి పోలియో చుక్కలు వేయించుకున్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారి పుష్పాల శ్రీధర్, డాక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొని పిల్లలకు చుక్కల మందు వేశారు. జిల్లా కేంద్రంలోని ఆంబిటస్ స్కూల్‌లో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వందశాతం లక్ష్యం చేరుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నేడు, రేపు ఇంటింటికీ తిరిగి మిగిలిపపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామని డీఎంహెచ్‌వో పుష్పాల శ్రీధర్ తెలిపారు.

జగిత్యాల: జిల్లా కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్

మల్లాపూర్: కొత్తదాంరాజ్‌పల్లిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సరోజన

గొల్లపల్లిలోని ఇటుక బట్టీల వద్ద చిన్నారికి చుక్కల మందు వేస్తున్న డాక్టర్ నరేశ్

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

జగిత్యాల/జగిత్యాల అర్బన్/జగిత్యాల రూరల్/మల్యాల/మల్లాపూర్, మార్చి 3: పోలియో రహిత సమాజ స్థాపన ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్ మోతెవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, టవర్ దగ్గర ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మల్యాల మండలంలోని తక్కళ్ళపల్లిలో పల్స్‌పోలియో శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి పుష్పాల శ్రీధర్ పర్యవేక్షించగా, మండల వైద్యాధికారి మౌనిక అన్ని కేంద్రాలను పరిశీలించారు. మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో, ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో పల్స్‌పోలియో కేంద్రాలను పల్స్‌పోలియో విభాగం రాష్ట్ర పరిశీలకుడు శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వాడవాడలో పల్స్ పోలియో

మారుతీనగర్/సారంగాపూర్/కొడిమ్యాల/ కోరుట్ల/కోరుట్ల రూరల్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/గొల్లపల్లి/వెల్గటూర్/కథలాపూర్/మేడిపల్లి/టిపల్లి రూరల్, మార్చి 3: చిన్నారులు అంగవైకల్యం బారిన పడకుండా ముందు జాగ్రత్తగా ఐదేండ్లలోపు ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మెట్‌పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఉపకేంద్రం ఆధ్వర్యంలో వైద్యురాలు వాణిరెడ్డి, జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో ఎంపీపీ మంగళారపు మహేశ్, మోరపెల్లిలో సింగిల్ విండో చైర్మన్ మైపాల్‌రెడ్డి, సారంగాపూర్ మండలంలో జిల్లా ఉప వైద్యాధికారి జైపాల్‌రెడ్డి, ఎంపీపీ రమేశ్, జడ్పీటీసీలు మనోహర్‌రెడ్డి, పాత పద్మ, వైస్‌ఎంపీపీలు, కొడిమ్యాల మండలంలో మండల వై ద్యాధికారి పరమేశ్వరి, హిమ్మత్‌రావుపేటలో జడ్పీ టీసీ ప్రశాంతి పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోరుట్లలోని 27వ వార్డు విశ్వ బ్రహ్మణ సంఘం భవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కోరుట్ల రూరల్ మండలం మాదాపూర్‌లో ఎంపీపీ నారాయణ, జడ్పీటీసీ లావణ్య, ఇబ్రహీంపట్నంలో ఎంపీపీ బీమేశ్వరీ, జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామింగ్ అధికారి శ్రీనివాస్, పెగడపల్లిలో ఎం పీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మండల వైద్యాధికారి నరేశ్, గొల్లపల్లిలో వైద్యాధికారి నరేశ్, వెల్గటూర్, అంబారిపేటలో డాక్టర్లు శ్రావణ్, లవకుమార్, జగదేవ్‌పేటలో ఎంపీపీ లక్ష్మి, వెల్గటూర్‌లో జడ్పీటీసీ సుధారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో ఎంపీపీ రేవతి, భూషణరావుపేటలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, చింతకుంటలో జడ్పీటీసీ భూమయ్య చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. మేడిపల్లి మండలంలోని గ్రామాల్లో స్టేట్ అబ్జర్‌వర్ శంకర్, జిల్లా పోగ్రామింగ్ ఆఫీసర్ సమియోద్దిన్, వైద్యాధికారులు, మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, ఎంపీపీ సాయిరెడ్డి, జడ్పీటీసీ రాధాశ్రీ తదితరులు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీ బదిలీ

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 3: జగిత్యాల అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావును బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గత సంవత్సరం ఆగస్టులో జగిత్యాల అడిషనల్ ఎస్పీగా బదిలీపై వచ్చిన రాయల ప్రభాకర్‌రావును లోక్ సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో జగిత్యాలలో ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు.

న్యాయం జరిగేలా చూడాలి

రాయికల్, మార్చి 3: పలు సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు, బాధితులకు సత్వర న్యాయ సేవలు అందేలా చూడాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. రాయికల్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం డీఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ అజయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తల్లీ కూతురు అదృశ్యం

అదృశ్యమైన వీణ, సితార

మెట్‌పల్లి, మార్చి 3: వెంకట్రావుపేకు చెందిన గుగ్లావత్ వీణ, కూతురు సితార అదృశ్యమైనట్లు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వీణ, భర్త మహేశ్, కూతురు సితారతో కలిసి వెంకట్రావుపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నది. కొన్ని రోజులుగా దంపతుల మధ్య డబ్బు విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 1న ఉదయం మళ్లీ గొడ వ జరగిందని వీణ రాంలచ్చక్కపేటలోని తన సోదరికి ఫోన్ చేసి తెలిపింది. ఆ వెంటనే వీణ తన ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసింది. అప్పటి నుంచి తల్లీ, కూతురు కన్పించడం లేదు. వీణ బావ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మెట్‌పల్లి, మార్చి 3: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింబాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మెట్‌పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోకవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

నేడు 'ప్రజా పాలన' ప్రారంభం

మెట్‌పల్లి, మార్చి 3: పట్టణంలో ప్రజాపాలనకు సంబంధించి మూడు సేవ కేంద్రాలను సోమవారం ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదివారం తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పాఠశాల వార్షికోత్సవం

మేడిపల్లి, మార్చి 3: తొంబర్‌రావుపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో ఆలరించారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వసతి గృహాల ప్రారంభం

సారంగాపూర్, మార్చి 3: మండలంలోని పెంబట్ల-కోనాపూర్ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయం కోనేరు పక్కన భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన వసతి గృహాలను సోమవారం ప్రారంభించనున్నట్లు ఈవో వడ్లూరి అనూష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గుట్టపైన విద్యుత్ పనులు

సారంగాపూర్, మార్చి 3: బీర్‌పూర్‌లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం కొండపైకి, జాతర గ్రౌండ్ సమీపంలో విద్యుత్ స్తంభాలకు మూడు వైర్లతో విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయగా లోడ్ ఎక్కువ అయ్యింది. దీంతో ఆదివారం విద్యుత్ అధికారులు అదనపు వైర్లను ఏర్పాటు చేశారు.

అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, మార్చి 3: ఐలాపూర్‌కు చెందిన చింతకింది రామచంద్రంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అజయ్ తెలిపారు. ఇటిక్యాల గ్రామ శివారులో భూమి విషయంలో రామచంద్రంకు, ఇటిక్యాలకు చెందిన మాదిగ కులస్తులకు జరిగిందన్నారు. వారిని కులం పేరుతో దూషించగా నాయిని ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నిధులు మంజూరు చేయాలి

జగిత్యాల, మార్చి 3: జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు కల్యాణ మండపం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మున్నూరు కాపు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వేములవాడలో ఎమ్మెల్యే నివాసంలో సంఘం సభ్యులతో కలిసి, కల్యాణ మండపం అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్ ఆయనను కలిసి సన్మానించారు.

కేసీఆర్‌తో దావ వసంత, హరిచరణ్‌రావు

కేసీఆర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు

కేసీఆర్‌తో లోక బాపురెడ్డి

జగిత్యాల/మేడిపల్లి/కథలాపూర్, మార్చి 3: తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కలిశారు. తెలంగాణ భవన్‌లో కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిశారు. పార్టీ భవిష్యత్తు ప్రణాళిక గురించి మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ సూచించారని వారు తెలిపారు. ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

ధర్మపురి, మార్చి 3 : పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ధర్మపురిలో సంబురాలు చేసుకున్నారు. పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పటాకులు కాల్చి, స్వీట్లు పంచారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈశ్వర్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ యూనుస్, తరాల కార్తీక్, నాయకులు స్తంబంకాడి మహేశ్, గడ్డం బాలరాజు, నక్క రాజేందర్, అనందాసు శ్రీనివాస్, చల్ల రవి, అప్పాల వసంత్, శేఖర్ ఉన్నారు.

సంగెం వాసికి యంగ్ ఉమెన్ రీసెర్చర్ అవార్డు

రాష్ట్ర గవర్నర్‌తో చేపూరి జ్యోతి

కోరుట్ల రూరల్, మార్చి 3: సంగెం గ్రామానికి చెందిన చేపూరి జ్యోతి యంగ్ ఉమెన్ రీసెర్చర్ అవార్డు అందుకున్నారు. మార్కెటింగ్ అండ్ అనాలిటిక్ విభాగంలో చేసిన పరిశోధనలకు గానూ వీనస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జ్యోతికి ఈ అవార్డును అందించింది. శనివారం చెన్నైలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమెకు అంతర్జాతీయ అవార్డును అందజేశారు. ప్రస్తుతం చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపకుల పరీక్షల్లో ఉద్యోగం పొందారు. జ్యోతిని గ్రామస్తులు అభినందించారు.

ధర్మపురి వాసికి 'కళారత్న' నేషనల్ అవార్డు

అవార్డు అందుకుంటున్న శివప్రసాద్

ధర్మపురి, మార్చి 3: ధర్మపురికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు, ప్రముఖ వ్యాఖ్యాత బోగ శివప్రసాద్ కళారత్న అవార్డు-2024ను అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన 7వ తెలంగాణ బహుజన సాహిత్య అకాడమీ అవార్డుల ప్రధానోత్సవంలో అవార్డును ప్రదానం చేశారు. అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రమణియన్, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, పెద్దపల్లి మాజీ ఎంపీ సుగుణాకుమారి, సినీ దర్శకుడు ప్రేమ్ రాజు చేతుల మీదుగా శివప్రసాద్ అవార్డు అందుకున్నారు. శివప్రసాద్‌ను పలువురు అభినందించారు.

డాక్టరేట్ సాధించిన నాచుపల్లి వాసి

చిగుర్ల రవి

కొడిమ్యాల, మార్చి 3: నాచుపల్లికి చెందిన చిగుర్ల రవి ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టా సాధించారు. భూగోళ శాస్త్ర విభాగంలో 'స్పేసియల్ అనాలిసిస్ ఆఫ్ ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఇంపాక్ట్ ఆఫ్ అగ్రో సర్వీసెస్ అండ్ సోషియా ఎకానమిక్ ఎంపవర్‌మెంట్ (జియోగ్రఫి)' అనే అంశంపై పరిశోధన నిర్వహించి విజయం సాధించారు. దీంతో యూనివర్సిటీ ఆధ్వర్యంలో రవికి డాక్టరేట్ పట్టాను అందించారు. పట్టా పొందడానికి కృషి చేసిన యూజీసీ రీసెర్చ్ సెంటర్ ఫర్ ఇండియన్ ఓషియన్ స్టడీస్ మాజీ డైరెక్టర్ అండ్ ప్రొఫెసర్ గీతారెడ్డి అనంత్‌కు రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గీతా ఆశ్రమ వార్షికోత్సవం

కోరుట్ల రూరల్, మార్చి 3: అయిలాపూర్‌లో విద్యాప్రకాశానందగిరి స్వామి గీతా ఆశ్రమ 28వ వార్షికోత్సవాలు రెండో రోజైన ఆదివారం ఘనంగా కొనసాగుతున్నాయి. స్వాములు గీతా పారాయణం, సుందరాకాండను ఆలపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

మేడిపల్లి, మార్చి 3: ప్రతీ వ్యక్తికి ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని భగవాన్ సత్యానంద మహర్షి పడిగెల ఆశ్రమ పీఠాధిపతి విరజానందతీర్థ స్వామి సూచించారు. బీమారం మండలం మన్నెగూడెంలో ఆదివారం భగవాన్ సత్యానందమహర్షి 473వ సంచార సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. పలువురు స్వామిజీలు పాల్గొని ప్రవచనాలు వినిపించారు. అంతకముందు భక్తులు గురుపూజ, ధ్యానం, శ్రీమద్భగవద్గీతా పారాయణం చేశారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

ధర్మపురి రూరల్, మార్చి 3: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఉదయ్‌కుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిసగోని వెంకటేశ్(29) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఉద్యోగం మానేసి మద్యానికి బానిసై, అప్పులు చేసి ఇటీవల స్వగ్రామమైన తిమ్మాపూర్‌కు వచ్చాడు. కాగా ఆదివారం ఉదయం ధర్మపురి శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకోగా, అటుగా వచ్చిన గొర్లకాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించాడు.


సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో జగిత్యాల తపస్ నాయకులు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. - జగిత్యాల టౌన్, మార్చి 3

ప్రజల మన్ననలు పొందడం అభినందనీయం

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మార్చి 3: ప్రజల మన్ననలు, ఆశీస్సులు పొందడం అభినందనీయమని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పేర్కొన్నారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు, ఆర్డీవోల బదిలీ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందడం, మంచి పనులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ.. అందరి సహకారంతోనే విధులు నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ తనపై చూపిన అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న బీఎస్ లత, ఆర్డీవోలు రాజేశ్వర్, నరసింహమూర్తి, డీబ్ల్యూవో భాస్కర్, అదనపు డీఆర్డీవో సుధీర్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ రాజేశ్వరమ్మను సత్కరించారు. అలాగే బదిలీపై వచ్చిన ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, ఆనంద్ కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, టీఎన్జీవో అధ్యక్షుడు శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి, తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు వకీల్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, సిబ్బంది

హ్యాండ్‌బాల్ పోటీల్లో మహేశ్ సత్తా

ట్రోఫీతో మహేశ్

వెల్గటూర్, మార్చి 3: హ్యాండ్‌బాల్ ఆల్ ఇండియా పోటీల్లో మహేశ్ బృందం సత్తా చాటి బ్రాంజ్ మెడల్ సాధించింది. వివరాల్లోకి వెళ్తే.. ఎండపల్లి మండలంలోని గుల్లకోటకు చెందిన బాస మహేశ్ మూడేండ్ల క్రితం స్పోర్ట్ కోటలో సీఐఎస్ఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఫిబ్రవరి 26 నుంచి ఈ నెల 2 వరకు నాగపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ క్రీడల్లో బాస మహేశ్ సీఐఎస్ఎఫ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించగా, ఆల్ ఇండియా స్థాయిలో మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించింది. జట్టు విజయంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డవేణి మధు, జిట్టవేణి శ్రీను, పీఈటీ మహేశ్ అభినందించారు.

క్రీడాకారులకు టీ షర్టులు, వాలీబాల్ అందజేత

పెగడపల్లి, మార్చి 3: పెగడపల్లి మండలం నంచర్లకు చెందిన వాలీబాల్ క్రీడాకారులకు మాజీ వార్డు సభ్యుడు ఎడ్ల శ్యాంసుందర్‌రెడ్డి ఆదివారం టీ షర్టులు, వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాములుగౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, తిరుపతి, ప్రభాకర్, శ్రీధర్, క్రీడాకారులు ఉన్నారు.

కేక్ కట్ చేస్తున్న మహిళలు

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

జగిత్యాల, మార్చి 3: జిల్లా కేంద్రంలోని రుద్ర కిట్టి పార్టీకి చెందిన మహిళలు ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం

జగిత్యాల, మార్చి 3: ప్రజారోగ్య శాఖలో ల్యాబ్ టెక్నిషియన్ల పాత్ర కీలకమని డీఎంహెచ్‌వో శ్రీధర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో టీఎస్‌జీఎంఎల్‌టీఏ అసోసియేషన్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ, జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్ మాట్లాడారు. ప్రజలందరికీ లక్షల సంఖ్యలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు హరినాథ్, జిల్లా అధ్యక్షుడు రాములు, జిల్లా కార్యదర్శి సునంద్ రావు, కోశాధికారి వినయ్, కార్యనిర్వహణ కార్యదర్శి సాయికృష్ణను సన్మానించారు.

పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

గొల్లపల్లి, మార్చి 3: ఇంటర్ వార్షిక పరీక్షల విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (475) రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ లింగంపల్లి దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేమిడి మల్లారెడ్డి సూచించారు. ఆదివారం గొల్లపల్లిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ఇంటర్ పరీక్షల నిర్వహణ తీరుపై ఆధారపడి ఉందన్నారు. పరీక్ష విధుల్లో పాల్గొనే అధ్యాపకులు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా బోర్డు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కోశాధికారి జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడు మచ్చ శేఖర్

రాయికల్, మార్చి 3: రాయికల్ లయన్స్ క్లబ్ 2024-25 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కడకుంట్ల నరేశ్, కోశాధికారిగా కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షులుగా కుర్మ సుదర్శన్‌రెడ్డి, కనపర్తి శ్రీనివాస్ ఎన్నికైనట్లు కాటిపెల్లి రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు, లయన్స్ డీసీ రమేశ్, భూమయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆదిరెడ్డి, కోశాధికారి ప్రవీణ్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా సీతారాముల కల్యాణం

కోరుట్ల రూరల్, మార్చి 3: మాదాపూర్‌లో సీతారాముల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లావణ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, ఎంపీటీసీ కృష్ణారెడ్డిపాల్గొన్నారు.

కథలాపూర్: బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బో'నమో' మల్లన్న

- ఘనంగా మల్లన్న స్వామి జాతర

మెట్‌పల్లి రూరల్/కోరుట్ల/కథలాపూర్, మార్చి 3: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో ఆదివారం మల్లన్న బోనాల జాతర ఘనంగా జరిగింది. మూడు రోజులుగా యాదవ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతరలో భాగంగా బోనాల పండుగ నిర్వహించారు. మంగళవారం నాగవెల్లి(అగ్నిగుండం) జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కోరుట్లలో యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో భీమునిదుబ్బ మల్లికార్జున స్వామి ఆలయ జాతరను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర న